

- నేడు ఉగాది పర్వదినం
- 'క్రోధి'కి వీడ్కోలు.. 'విశ్వావసు'కు స్వాగతం..
- ఆలయాల్లో పూజలు, పంచాంగ శ్రవణాలు
- పచ్చడి రుచులు, కవి సమ్మేళనాలు
- జిల్లాలో పండుగ సందడి

షడ్రుచుల సమ్మేళనం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

షడ్రుచుల సమ్మేళనం.. ఉగాది పర్వదినం.. తెలుగువారి తొలి పండుగ ఉగాది నుంచి తెలుగు నూతన సంవత్సరం ప్రారంభం అవు తుంది. ఆదివారం క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. శ్రీ విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకనున్నారు. ఎన్నో ఆశలు, ఆనందాల వైపు అడుగులు వేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు ఉగాది వేడుకలకు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రతి ఇల్లు పచ్చటి తోరణాలతో అలంకరిస్తారు. వేప పువ్వు, లేత మామిడికాయల ముక్కలు, కొత్త చింతపండు పులుసు, కొత్త బెల్లం పానకంతో తయారుచేసిన ఉగాది పచ్చడి సేవిస్తారు. ఇరుగు... పొరుగు వారిని పిలిచి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ పచ్చడిని అందిస్తారు. జిల్లాలోని వివిధ సంస్థలు ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేశారు. పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. జిల్లాలోని పలు దేవాలయాల్లో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేశారు. పచ్చడి కుండలు, మామిడి కాయలు, వివిధ సామగ్రి కొనుగోళ్లతో సిరిసిల్ల మార్కెట్ సందడిగా మారింది.



పచ్చడిలో ఔషధగుణాలు ఎన్నో..

ఉగాది పచ్చడి చాలా మంచి ఔషధ గుణాలను కలిగి ఉంటుందని పెద్దలు చెబుతారు. తీపీ, పులుపు, ఉప్పు, వగరు, చేదుతో తయారయ్యే పచ్చడిలో చెరుకు, మామిడి, వేపపూలు, కొత్త చింత, జామకాయలు, బెల్లం కూడా వేస్తారు. కొత్త కుండలో వీటి సమ్మేళనంతో రసం తయారు చేస్తారు. ఉగాది పచ్చడిని 'నింబ కుసుమ భక్షణం', అశోక కలిక ప్రాశనం అని కూడా పిలుస్తారు. ఉగాదిరోజు ప్రత్యేకంగా ఫలానా దేవున్ని పూజించాలని లేకపోవడంతో ఎవరి ఇష్టదైవాన్ని వారు పూజిస్తారు. విశ్వకర్మలు మాత్రం అమావాస్య నుంచే మూడు రోజుల పాటు వేడుకలు జరుపుకుంటారు. అమవాస్య రోజున విశ్వకర్మలు ప్రమిదలు వెలిగించారు. ఇంటిని అలంకరించడంతోపాటు తాము ఆరాధించే విశ్వకర్మకు, గాయిత్రిదేవి, వీరబ్రహ్మేంద్రస్వామికి కలిపి పూజ పీటను ఏర్పాటు చేస్తారు. మూడు రోజుల పాటు ప్రమిద ఆరిపోకుండా చూస్తారు. కొత్తగా వచ్చిన గోదుమలు, బియ్యం, శనిగపప్పు, బెల్లంతో నైవేద్యం వండుతారు. అమావాస్య రోజున తయా రుచేసే 41 కంకణాలను ఉగాది రోజున కట్టుకుంటారు.

రాశిఫలాలు.. జాతకచక్రాలు

ఉగాది పండుగ కొత్త పంచాంగం వచ్చిందంటే అందరిలోనూ రాశి ఫలాలు, జాతకచక్రాలపైనే ఆసక్తి ఉంటుంది. సంవత్సరంలో జాతక చక్రం ప్రకారం రాశి ఫలాలు, గ్రహస్థితులు ఏలా ఉన్నాయో తెలుసుకోవడానికి ఇష్టపడుతారు. జిల్లాలోని అన్ని దేవాలయాల్లో పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు చేశారు. గ్రహ శాంతులు జరిపించుకొని సుఖంగా ఉండేందుకు పంచాంగ శ్రవణం తప్పనిసరిగా పెద్దలు భావిస్తారు. ఇందులో ఉండే తిథి, వార, నక్షత్రాలకు అనుగుణంగానే ముహూర్తాలను నిర్ణయించుకుంటారు. ఉగాది నాడే ఆదాయ, వ్యయాలు, రాజపూజ్య, అవమానాలు తెలుసుకుంటారు. రైతులు ఏ కార్తెలో వర్షాలు కురుస్తాయో కూడా తెలుసుకుంటారు.

జోరుగా పచ్చడి కుండల కొనుగోళ్లు..

సూర్య ప్రతాపం ఎక్కువగా ఉంది. ఎండలో చల్లటి నీళ్ల తాగడానికి పచ్చడి కుండలు ఉపయోగపడుతాయి. ఉగాది రోజు పచ్చడి చేసుకునే కుండలు చల్లటి నీళ్ల కోసం ఉపయోగిస్తారు. ఈసారి మట్టి కుండలకు గిరాకీ పెరిగినా ధరలు మాత్రం భయపెట్టాయి. సైజ్‌ను బట్టి రూ. 100 నుంచి రూ.300 వరకు ఉన్నాయి. పచ్చడికి ఉపయోగించే మామిడి కాయలు, చింతపండు, వేపపువ్వు సైతం మార్కెట్ భారీ ధరలే పలికాయి.

పాఠశాలల్లో ముందస్తు వేడుకలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో శనివారం ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలను విద్యార్థులు సంబురంగా జరుపుకున్నారు. పచ్చడి తయారుచేసి పంచారు. పాఠశాలను ముస్తాబు చేయడంతో పండుగ వాతావరణం ముందే మొదలైంది. విద్యార్థులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉపాధ్యాయులు పండుగ ప్రాశస్త్యం గురించి వివరించారు. సిరిసిల్లలో మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు.

'పది' పరీక్షకు 14 మంది గైర్హాజరు

- పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

సిరిసిల్ల రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు జిల్లాలో శనివారం ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లాలోని 35 పరీక్షా కేంద్రాల్లో 6,767 మంది విద్యార్థులకు 6,753మంది విద్యార్థులు హాజరుకాగా 14మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని శనివారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. విద్యార్థులు పరీక్షలు రాసే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సీహెచ్ వీఎస్ జనార్ధన్‌రావులు తదితరులు పాల్గొన్నారు.


గీతానగర్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నష్టపరిహారం అందరికీ సమానంగా ఇవ్వాలి


ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

వేములవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో ప్రధాన రహదారి విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న వారికి సమానంగా పరిహారం అందించాలని నిర్వాసితులు కోరారు. ఈ మేరకు వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు బాధితులతో ఆర్డీవో రాజేశ్వర్ శనివారం సమావేశం నిర్వహించారు. పలువురు భూయజమానులు మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ చట్టం అమలుచేయాలని అన్నారు. భవన యజమానులు కూర దేవేందర్, విమలక్క, పంపరి అంజయ్య, నాగరాజు, అశోక్, గోపాల్, లక్ష్మణ్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి సన్నిదిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఉదయాన్నే కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.

సమష్టి కృషి, అంకితభావంతోనే అభివృద్ధి..

- పోతుగల్ సహకార సంఘం చైర్మన్ తన్నీరు బాపురావు



మాట్లాడుతున్న చైర్మన్ తన్నీరు బాపురావు

ముస్తాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సమష్టిగా కలిసి చేసిన అంకిత భావంతోనే సహకార సంఘం అభివృద్ధి జరిగిందని మండలంలోని పోతుగల్ సహకార సంఘ చైర్మన్ తన్నీరు బాపురావు పేర్కొన్నారు. పోతుగల్ సహకార సంఘపరిధిలో ఛైర్మన్ తన్నీరు బాపురావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అప్పుల్లో ఉన్న సహకార సంఘాన్ని రూ.29 కోట్ల 58 లక్షల 18వేల రూపాయల లాభాల్లో నడిపిస్తున్నట్లు తెలిపారు. వైస్‌ఛైర్మన్ రాజేశం, డైరెక్టర్లు కట్ట బాపురావు, సతీశ్‌చందర్‌రావు, వెంకట్‌రెడ్డి, బాలమల్లు, లక్ష్మణ్‌రావు రైతులు తదితరలు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి కోసమే సింగిల్ విండోలు..



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నర్సయ్య

కోనరావుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభివృద్ధి కోసమే సింగిల్ విండో సంఘాలు ఏర్పడ్డాయని కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య అన్నారు. కోనరావుపేట సింగిల్ విండో సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-2025 సంవత్సర లావాదేవీలను సభ్యులకు వినిపించారు. రైతులు పొందిన రుణాలను సకాలంలో చెల్లించి సింగిల్ విండో కార్యాలయాలను కాపాడుకోవాలని అన్నారు. వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, డైరెక్టర్లు రమేష్ రెడ్డి, మహేశ్వరి, రామకిషన్ రెడ్డి, రంగారెడ్డి, రాజు, భూపతిరెడ్డి, అనిల్ కుమార్, ఆనందం, సీఈవో కేశవులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి చేయూతనివ్వాలి



మాట్లాడుతున్న చైర్మన్ బండి దేవదాస్

తంగళ్లపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనివ్వాలని సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బండి దేవదాస్ కోరారు. శనివారం సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో సంఘం మహాజన సభ జరిగింది. ముఖ్యఅతిథిగా వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఐకెపీ,ప్యాక్స్‌లు సంయుక్తంగా నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా ప్రయత్నిస్తానన్నారు. సిరిసిల్ల ప్యాక్స్ ఆధ్వర్యంలో మంజూరైన రూ.56 లక్షల దీర్ఘకాలిక రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, డైరెక్టర్లు గడిల సరేష్, వెన్నమనేని శ్రీధర్‌రావు, బండి దేవేందర్‌యాదవ్, భైరి ప్రభాకర్, సత్తు వెంకట్‌రెడ్డి, ప్రమీల, శనిగరపు లక్ష్మీ, పర్శయ్య, బానావత్‌ఘన్యా నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తికి వన్నె తెచ్చిన ఉమాశంకర్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తికే ఉమాశంకర్ వన్నె తెచ్చారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. 60 ఏళ్ల న్యాయవాద వృత్తి పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం సిరిసిల్ల పట్టణంలోని లహరి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఉమాశంకర్‌ను న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత మాట్లాడుతూ ఎంతో న్యాయవాది వృత్తిలోనే 60 సంవత్సరాలు పూర్తిచేయడం అభినందనీయమన్నారు. ప్రతి న్యాయవాదికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. అనంతరం సన్మానగ్రహీత ఉమాశంకర్ మాట్లాడుతూ సంతోషమే ఆరోగ్యానికి తొలిమెట్టని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీ ణ్, 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మే ఘన, కవి జూకంటి జగన్నాథం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, గుడిసె సదానం దం, కార్యదర్శులు వెంకటి, రజ నికాంత్, మాజీ ఏజీపీ రవీందర్‌రావు, కుమారులు శివప్రసాద్, హరిప్రసాద్, గుడ్ల రవి, సీనియ ర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత జూకంటి జగన్నాథం రాసిన మానది అనే పుస్తకాన్ని జిల్లా జడ్జి ప్రేమలత ఆవిష్కరించారు. పుస్తకాన్ని ఉమాశంకర్‌కు అంకితం చేస్తున్నట్లు రచయిత జూకంటి జగన్నాథం ప్రకటించారు.


న్యాయవాది ఉమాశంకర్‌ను సన్మానిస్తున్న జిల్లా జడ్జి ప్రేమలత తదితరులు

ఆస్తి పన్నులు వసూలు చేయాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ఉగాది, రంజాన్ పర్వదినాల్లో కూడా ఆస్తి పన్నులు వసూలు చేయాలని శనివారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30, 31 తేదీల్లో మున్సిపల్ సిబ్బంది ఆస్తి, ఇతర పన్నులు యథా విధిగా వసూలు చేయాలని, ఇందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

కొవ్వొత్తులతో నివాళులు..

ఎల్లారెడ్డిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో క్రైస్తవులు శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి పాత బస్టాండు మీదుగా కొత్త బస్టాండు వరకు ర్యాలీ కొనసాగించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించి మౌనం పాటించారు. పాస్టర్ ప్రవీణ్ మరణానికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు రాజేశ్, ప్రేమ్‌కుమార్, మధుబాబు, కిషోర్‌కుమార్, రూబెన్, జోనాతన్, యేసుదాస్, జోషి, క్రైస్తవులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండలం కేంద్రంలో పాస్టర్ అసోసియేషన్ మండలఅధ్యక్షుడు జే పౌలు అధ్వర్యంలో పాస్టర్‌లు, క్రైస్తవులు, సంఘ కాపరులు, విశ్వాసులు పాస్టర్ ప్రవీణ్ పగడాల అకాల మరణానికి సంతాపం సూచకంగా శనివారం కొవ్వొత్తులతో సమావేశాన్ని నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని సామూహికంగా ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్‌లు నతనియేలు, యేసుదాస్, ప్రభుదాస్, సంసోన్, శాంతి ప్రసాద్, ఇస్సాక్, నవీన్, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో జరిగే కదలికలపై స్పందించాలి

- రచయితల వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం

సిరిసిల్ల రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో జరిగే కదలికలపై కవులు, రచయితలు స్పందించాలని రచయితల వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జూకంటి జగన్నాథం కోరారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో శనివారం సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో విశ్వావసు నామసంవత్సరం ఉగాది కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. మాడురు అనిత రచించిన రంగుల కథల సంపుటిని జూకంటి జగన్నాథంతోపాటు బాలసాహితీవేత్త డాక్టర్ కందేపీ రాణిప్రసాద్‌లు ఆవిష్కరించారు. విశిష్టఅతిథిగా హాజరైన జూకంటి జగన్నాథం మాట్లాడుతూ సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కవులు, రచయితలు ప్రతిస్పందన ఉండాలన్నారు. సభ అధ్యక్షురాలు బాలసాహితీవేత్త డాక్టర్ కందెపీ రాణి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు పర్యావరణాన్ని నష్టంచేయకుండా ఉండాలని, సాహితీరంగంలో మహిళలు రాణించాలని కోరారు. కార్యక్రమంలో మానేరు రచయిత సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ నారాయణ, కార్యనిర్వహణ అధ్యక్షుడు ఎలగోండ రవి, ప్రధాన కార్యదర్శి అడెపు లక్ష్మణ్, మారసం సభ్యులు అంకారపు రవి, దూడం గణేష్, చిటికెన కిరణ్‌కుమార్, మాడూరి అనిత, వందన, ఇడెపు సౌమ్య, కవులు బూరా దేవానందం, కామారపు శ్రీనివాస్, కరుణాకర్, పాలి భాగ్యలక్ష్మి, నరసింహులు, దేవయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉగాది సమ్మేళనంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు..

జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో..

సిరిసిల్ల గాంధీనగర్‌లోని హనుమాన్ మందిరంలో శనివారం జిల్లా సాహితీ సమితి నాయకులు డాక్టర్ జనుపాల శంకరయ్య అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా జనపాల శంకయ్య మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్, కరుణాల భద్రాచలం, సీనియర్ సిటీజన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, శ్రీగాధ వైసయ్య, దోంత దేవదాస్, అంకారపు జ్ఞానోభాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్, కవులు గుడూరి బాలరాజు, సింగిరెడ్డి రాజిరెడ్డి, గోశికొండ మురారిపంతులు, గోష్కొండ దామోదరం పంతులు, గడ్డం పర్శరామశాస్త్రీ, జిల్లా శ్రీనివాస్ పంతులు, బూర దేవానందం, మాదిరెడ్డి అంజనాదేవి, గడ్డం కౌసల్య, కనపర్తి హనుమాండ్లు, ముడారి సాయిమహేష్, గుండెల్లి వంశీకృష్ణ, గజ్జెల్లి కుమారస్వామి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


తాగునీటికి తిప్పలు

- అడుగంటిన భూగర్భ జలాలు
- ఆదుకోని మిషన్ భగీరథ
- వేసవి ప్రారంభంలోనే ఇబ్బందులు

గంగాధర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎండకాలం ప్రారంభంలోనే గ్రామాల్లో తాగునీటి సమస్య, ఎండిపోతున్న బావులు, అడుగంటిన భూగర్భ జలాలు, ఆదుకోని భగీరథ పథకంతో ప్రజలు అవస్థలపాలవుతున్నారు. గంగాధర మండలం సర్వారెడ్డిపల్లి, ఆచంపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నది. ఆచంపల్లిలో రెండు మంచి నీటి బావులు, 20 సింగిల్ ఫేస్ బోర్లు, మిషన్ భగీరథ


ఆచంపల్లిలో తాగునీరు అందించే బోర్

నీరు వస్తున్నా తాగు నీటికి తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా ఎస్సీ కాలనీకి ప్రతి యేటా నీటి సమస్య ఏర్పడుతోంది. గ్రామంలో వాడవాడలకు బోర్లు ఏర్పాటు చేయడంతో వోహెచ్ఆర్ ట్యాంకు నుంచి గ్రామంలోకి నీటిని సరఫరా చేయడం నిలిచిపోయింది. దీనికి తోడు గ్రామంలో ఎక్కువగా ఫ్లోరైడ్ ఉండగా పైపుల్లో ఫ్లోరైడ్ గడ్డకట్టి ఎక్కడి కక్కడా లీకేజీలు ఏర్పడ్డాయి. ఎనిమిది సంవత్సరా లుగా సగం గ్రామానికి వోహెచ్ఆర్ ట్యాంకు నుంచి నీరు సరఫరా చేయక ఫ్లోరైడ్‌తో పైపులు నిండిపోయింది. వాడవాడకు ఏర్పాటు చేసిన బోర్లలో ఏదో ఒక సమస్యతో చాలా వరకు బోర్లు పని చేయడం లేదు. దీంతో చేసేదేం లేక అదనంగా ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా ఇదే సమస్యతో వేసవిలో నీటికి ఇబ్బందులు పడుతూ కాలం వెల్లదీస్తున్నారు. గ్రామంలో కొత్త పైపులైను వేస్తే నీటి సమస్య తీరుతుందని గ్రామస్థులు చెపుతున్నారు. చిన్న గ్రామపంచాయతీకి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు జీతాలకు, ట్రాక్టర్ కిస్తీలకు, కరెంటు బిల్లులకు వినియోగిస్తున్నారు. గ్రామంలో 20 సింగిల్ ఫేస్ మోటార్లు నడుస్తుండగా గత 8 సంవత్సరాలుగా వస్తున్న కరెంటు బిల్లు రూ. 25 లక్షలకు చేరింది. ఈ బిల్లు ఎలా చెల్లించేదని కార్యదర్శి తలపట్టుకుంటున్నారు.


మర్రిగడ్డ బావిలో అడుగంటిన భూగర్భ జలాలు

● క్వారీతో అడగంటిన భూగర్భ జలాలు

సర్వారెడ్డిపల్లి అనుబంధ గ్రామం మర్రిగడ్డ శివారులో గతంలో మంచినీటి బావి తవ్వారు. 17 గజాల లోతు బావిలో రెండు నెలలుగా కేవలం అరమీటరు నీరు ఊరుతుంది. బావి మోటర్ ఆన్ చేస్తే అరగంట మాత్ర మే వస్తున్న నీరు సరిపోవడంలేదు. బావికి రెండు వందల మీటర్ల దూరంలో క్వారీ తవ్వకాలు జరుగుతున్నాయి. గతంలో సమృద్ధిగా నీరందించిన బావి క్వారీ తవ్వకాలతో క్రమక్రమేనా భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో గత మూడేళ్లుగా ఏప్రిల్‌లోనే ఎండిపోతోంది. రెండు రోజులకోసారి వస్తున్న మిషన్ భగీరథ నీటినే పొదుపుగా వాడుకుంటున్నారు. ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ముప్పిడి పల్లి బావి నుంచి సర్వారెడ్డిపల్లి, మర్రిగడ్డ, ముప్పిడి నర్సయ్యపల్లికి నీటిని సరఫరా చేస్తుండే వారు. ముప్పిడి నర్సయ్యపల్లి కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడగా ఈ బావి నీటిని సర్వారెడ్డిపల్లికి నిలిపి వేశారు. దీంతో సర్వారెడ్డిపల్లి, మర్రిగడ్డ గ్రామాలు వేసవిలో తీవ్ర నీటి కష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. పొలాల కోతలు పూర్తయితే వ్యవసాయ బావులవద్ద నుంచి నీటిని మోసుకు వస్తుంటారు. అయితే చెరువు సమీపంలో కొత్త బావి తవ్వించాలనే ప్రతిపాధన ముందుకు సాగడం లేదు. అధికారులు తాగునీటికి ఏర్పాట్లు చేసి వేసవిని గట్టెక్కించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మూడేళ్లుగా నల్లానీటికి గోసపడుతున్నం..



- కనుకమ్మ, ఆచంపల్లి

మా కాలనీకి మూడేళ్లుగా నల్లా నీరు వస్తలేవు. ఇక్కడ వాడకు ఒక్కటే బోరు ఉంది. దాని నుంచే అందరం నీరు తెచ్చుకుంటాం. కరెంటు ఉంటేనే మాకు నీరు. సొంతంగా పైపులు తెచ్చుకుని నీటిని డ్రంబుల్లో నింపుకుని వాడుకుంటాం. మా ఊరి నీల్ల సమస్యను పరిష్కరించాలి.

కులం కట్టుబాట్లే హత్య చేయించాయి

● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యం రావు


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముత్యంరావు

ఎలిగేడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కులం కట్టుబాట్లు పరువు హత్యకు పురిగొలిపాయని సీపీఎం జిల్లాకార్యవర్గ సభ్యుడు ముత్యం రావు అన్నారు. శనివారం ముప్పిరితోటలో ఇటీవల పరువు హత్యకు గురై మృతిచెందిన పురేళ్ల సాయికుమార్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. హత్యకు దారితీసిన పరిస్థితులను మృతుడి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కులం, కట్టుబాట్లు, మూఢత్వం పేరుతో సాయికుమార్‌ను హత్యచేశారని, ప్రేమించుకున్న పాపానికి అత్యంత దారుణంగా హత్య చేయడం క్షమించరాని నేరమన్నారు. ఇలాంటి సంఘటనతో సభ్యసమాజం సిగ్గుతో తలదించుకోవాలని, మళ్ళీ ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అందుకు ఫాస్ట్ ట్రాక్‌కోర్టు ఏర్పాటుచేసి విచారణ త్వరితగతిన పూర్తిచే యాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్‌యంత్రాంగం జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లాకమిటీసభ్యుడు అశోక్, నాయకులు మోదంపల్లి శ్రావణ్, జిల్లాల ప్రశాంత్, నవీన్‌తదితరులు పాల్గొన్నారు.

హత్యపై విచారణ వేగవంతం చేయాలి

● ఏసీపీని అభ్యర్థించిన సాయికుమార్ మిత్రులు


ఏసీపీ కార్యాలయంలో సాయికుమార్ మిత్రులు

ఎలిగేడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం ముప్పిరి తోట గ్రామంలో ఈనెల27నజరిగిన పూరెళ్ల సాయికుమార్(20) దారుణ హత్యపై విచారణ వేగవంతం చేయాలని శనివారం రాత్రి మృతుడు సాయికుమార్ మిత్రులు పెద్దపల్లి ఏసీపీ గజ్జికృష్ణను కలిసి అభ్యర్థించారు. గతంలో రెండుసార్లు సాయికుమార్‌పై దాడిచేసి హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆయనకు వివరించారు. హత్య చేసిన ముత్యం సది అలియాస్ సదయ్య, భార్య సమత, బావమరిది సారయ్య, హత్యకు ప్రేరేపించి, కుట్రపన్నిన చీకటి హరీష్, మల్లయ్యను కఠినంగా శిక్షించాలని ఏసీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్మికుడు మృతి

గంగాధర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గంగాధర పంచాయతీ కార్మికుడు షాహిద్(28) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు గతంలో విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం పని చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌తగిలి కుడిచేయి పోగొట్టుకున్నాడు. శనివారం చాతిలో నొప్పి వస్తుందని తెలుపగా అక్కడే పనిచేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది కాళ్లు, చేతులు రాపిడిచేసి 108కు సమాచారం అందించారు. జగిత్యాల ఏరియాఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

సుల్తానాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో శనివారం వృద్ధురాలు మృతిచెందింది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన పత్రి నర్సయ్య, కళావతి దంపతులు ఐదు రోజుల క్రితం గర్రెపల్లికి వచ్చారు. వీరు భిక్షాటన వృత్తిగా చేసుకుని జీవిస్తారు. శుక్రవారం రాత్రి భోజనం చేసి పడుకున్నారు. శనివారం ఉదయం ఎనిమిదన్నర గంటల ప్రాంతంలో కళావతిని నిద్రలేపగా చనిపోయి ఉంది. దీంతో మృతురాలి భర్త నర్సయ్య వెంటనే కూతురు కల్పనకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. తల్లి మృతిపట్ల అనుమానాలు ఉన్నాయంటూ కూతురు కల్పన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసుకున్నారు.

కెనాల్‌లో పడి గల్లంతైన చిన్నారి

రామగిరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఇటుక బట్టీలో పనిచేసే ఒడిశా రాష్ట్రం అంగూల్ జిల్లాకు చెందిన కూలీ దాత్‌సాగర్ దంపతుల చిన్న కూతురు గేలిహీ(2) అనే చిన్నారి డి-83 కెనాల్‌లో శనివారం ప్రమాదవశాత్తు పడింది. ఇటుక బట్టీలో పని కోసం 7 నెలల క్రితం ఇక్కడకు వచ్చారు. దాత్‌సాగర్‌కు ముగ్గురు పిల్లలు. శనివారం కెనాల్ సమీపంలో ఆడుకుంటుండగా అదుపు తప్పిన చిన్నారి కెనాల్‌లో పడి గల్లంతైంది. కెనాల్ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ఎస్ఐ చంద్రకుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. గల్లంతైన చిన్నారి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశారు.

ఈత చెట్టుపై నుంచి పడి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన మొగిలిపాక తిరుపతిగౌడ్ అనే కల్లు గీత కార్మికుడు శనివారం కల్లు గీయడానికి ఈత వనంలోకి వెళ్లాడు. ఎప్పటిలాగానే ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారికింద పడిపోగ తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన గ్రామస్థులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏసీబీకి చిక్కిన మార్కెట్ కమిటీ సెక్రెటరీ, సెక్యూరిటీగార్డు

● పండ్ల వ్యాపారుల లైసెన్స్‌కు రూ.2 లక్షలు డిమాండ్ ● 60 వేలు తీసుకుంటుండగా ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పండ్ల వ్యాపారుల నుంచి 60వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదరి ఎ.పురుషోత్తం, సెక్యూరిటీగార్డు శ్రీనివాస్‌రెడ్డిని అవినీతి నిరోధకశాఖ అధికారులు శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో హోల్‌సేల్ పండ్లవ్యాపారులు ఏఎంసీలోనే షెడ్లు, గోదాంలలో మామిడి, బత్తాయి వంటి వివిధ రకాల పండ్లను నిలువ చేస్తారు. అక్కడి నుంచే జిల్లా వ్యాప్తంగా రిటైల్ వ్యాపారులకు విక్రయిస్తారు. దీని కోసం హోల్‌సేల్ వ్యాపారులు ఏఎంసీ నుంచి లైసెన్స్ తీసుకోవాలి. నామినల్‌గా వెయ్యి నుంచి 2 వేల వరకు ఫీజు చెల్లించాలి. ఈలైసెన్స్‌ను వ్యాపారులు మూడేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలి. ఏఎంసీలో హోల్‌సేల్ పండ్ల వ్యాపారం చేస్తున్న 15మంది లైసెన్స్‌ల గడువు ఈనెల31తో ముగుస్తుంది. రెన్యూవల్ చేయాలని నెల రోజుల నుంచి ఏఎంసీ సెక్రెటరీని కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. ఒక్కో లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.2 లక్షలు ఇవ్వాల్సిందేనని కార్యదర్శి పురుషోత్తం డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని పండ్లవ్యాపారులు రిక్వెస్ట్ చేసినా తగ్గేదేలేదని చెప్పాడు. చివరికి శుక్రవారం పండ్ల వ్యాపారులతో తన చాంబర్‌లోనే ఒక సమావేశం ఏర్పాటుచేసి ఒక్కోవ్యాపారి 60వేల రూపాయలతోపాటు అన్ని డాక్యుమెంట్లు సమర్పిస్తే లైసెన్స్ రెన్యూవల్‌కు అంగీకరించాడు. దీంతో వ్యాపారులు కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తిని ఆశ్రయించారు. కరీంనగర్ ఫ్రూట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మకాయలపాషా, అలియాస్ ఎండీ అబ్దుల్‌గఫార్ ఈ మేరకు ఫిర్యాదుచేశాడు. ఏసీబీ పోలీసుల సూచనతో మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిమ్మకాయల పాషా అలియాస్ అబ్దుల్‌గఫార్ 60వేల రూపాయలు లంచం డబ్బులు సెక్రెటరీ పురుషోత్తంకు అతడి చాంబర్‌లోనే ఇచ్చేందుకు వెళ్లాడు. బయటసెక్యూరిటీ గార్డుకు ఇవ్వాలని పురుషోత్తం సూచించాడు. బాధితుడు ఆ డబ్బులను సెక్యూరిటీగార్డు శ్రీనివాస్‌రెడ్డికి ఇస్తుండగా మఫ్టీలో ఉన్న ఏసీబీ పోలీసులు పట్టుకున్నారు. అనంతరం సెక్రెటరీతోపాటు, సెక్యూరిటీగార్డును అరెస్టు చేశారు. 60 వేల రూపాయలు సీజ్ చేసినట్టు, ఆదివారం కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు


ఏసీబీకి చిక్కిన మార్కెట్ కమిటీ కార్యదర్శి పురుషోత్తం, సెక్యూరిటీ గార్డు శ్రీనివాస్‌రెడ్డి, స్వాధీనం చేసుకున్న నగదు



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

● జగిత్యాలలో సోదాలు..

ఏఎంసీ సెక్రెటరీ పురుషోత్తం చాంబర్‌లో ఏసీబీ డీఎస్పీ వివి రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు జరిపారు. పండ్లవ్యాపారుల లైసెన్స్‌ల రెన్యూవల్ కోసం సమర్పించిన దరఖాస్తులు, ఇతర రికార్డులను సీజ్‌చేశారు. మరో వైపు ఏసీబీ మరో బృందం పురుషోత్తం స్వస్థలం జగిత్యాలలోని అతడి ఇంటిలో, మరో చోట సోదాలు జరిపారు. లక్షకుపైగా నగదు, ఇతర డాక్యుమెంట్లను సీజ్ చేశారు.

● లంచాల కోసం వేధింపులు..

కరీంనగర్ ఏఎంసీకార్యదర్శి ఎ.పురుషోత్తం ఐదేళ్లుగా లంచాల కోసం పండ్ల వ్యాపారులను వేధిస్తున్నాడని పండ్ల వ్యాపారులు నిమ్మకాలయపాషా, సుల్తాన్ ఆబిద్ ఆరోపించారు. తాము ఆరేళ్లుగా కరీంనగర్ ఏఎంసీలో హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. పండ్లు నిలువ చేసుకునేందుకు ఏఎంసీలో చిన్నచిన్న షెడ్‌లను అద్దెకు తీసుకుంటామన్నారు. షెడ్‌కు రూ.20వేల అద్దెను క్రమంతప్పకుండా ఏఎంసీకి చెల్లిస్తున్నా అదనంగా కార్యదర్శి పురుషోత్తం మరో రూ.20వేలు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. లంచంఇవ్వని వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్నాడని వాపోయారు. పండ్లలోడ్‌తో వచ్చినవాహనాలను మార్కెట్‌యార్డులోకి అనుమతించక పోవడం, గేట్ మూసివేయడం వంటివి చేసేవాడని పేర్కొన్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. షెడ్‌ల కోసం అదనంగా వసూలు చేసిన డబ్బులను రికవరీ చేయాలన్నారు.

ఎస్‌యూలోనే ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీలోనే ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేయాలని హుస్నాబాద్‌కు తరలిస్తున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం యూనివర్సిటీ గేటు ఎదుట ధర్నాచేశారు. అనంతరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వఇంజనీరింగ్ కళాశాల కలగానే మిగిలిపోతోందన్నారు. ఉత్తరతెలంగాణలో కరీంనగర్ విద్యాకేంద్రంగా మారుతున్న తరుణంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థులు ప్రైవేటుఇంజనీరింగ్ కళాశాల ల్లో ఫీజులు కట్టలేక విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చినహామీలను నెరవేర్చడంలో విఫలమైంద న్నారు. కరీంనగర్ జిల్లాలో కళాశాలను ఏర్పాటుచేస్తామని స్వయంగా సీఎంరేవంత్‌రెడ్డి పెద్దపల్లిసభలో ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో పొన్నంప్రభాకర్ ఇల్లు ముట్టడిస్తామని అన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు గజ్జెల శ్రీకాంత్, మచ్చ రమేష్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కాంపల్లి అరవింద్, రామారాపు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, టౌన్ అధ్యక్ష కార్యదర్శులు రాము, హేమంత్, నాయకులు సురేష్, సాగర్, సందీప్, సందేశ్, రాకేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌యూ గేటు ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఎంత కష్టం!

- కన్నతల్లిని రోడ్డు పక్కన వదిలి వెళ్లిన కొడుకులు
- సిరిసిల్లకు తరలించిన అంగన్‌వాడీ కార్యకర్తలు


వృద్ధురాలు

వేములవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఏడు పదుల వయసులో ఆ వృద్ధురాలికి అనుకోని కష్టం వచ్చింది. కన్నకొడుకులు నడిరోడ్డుపైనే వదిలేయడంతో ఆ తల్లి దాదాపు 20 రోజులు నరకయాతన అనుభవించింది. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఆమెను చేరదీసి సిరిసిల్లకు తరలించారు. వేములవాడ పట్టణంలో శనివారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్ల సమీపంలోని పెద్దూరుకు చెందిన గంగవ్వ(70)కు ఇద్దరు కొడుకులు. ఏం జరిగిందో తెలియదు కానీ దాదాపు 20 రోజుల క్రితం గంగవ్వను కారులో తీసుకువచ్చి వేములవాడ పట్టణంలోని జాతరగ్రౌండ్ లక్ష్మీగణపతి కాంప్లెక్స్ ఎదురుగా మెట్లపై వదిలేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. వృద్ధాప్యానికి అనారోగ్యం తోడు కావడంతో నడవలేని స్థితిలో ఉన్న ఆమెకు 20 రోజులుగా స్థానికులు కొంత ఆహారం అందిస్తూ వచ్చారు. విషయం తెలుసుకున్న వేములవాడ సీడీపీవో సౌందర్య శనివారం అంగన్‌వాడీ సిబ్బందితో వచ్చి వృద్ధురాలికి స్నానం చేయించి, బట్టలు మార్పించి సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మండల కేంద్రంలో కాలేజీ ఏర్పాటు చేయాలి

- ప్రతి రోజు 40కిలోమీటర్లు ప్రయాణిస్తున్న ఇంటర్ విద్యార్థులు
- తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా చదువులు


కాలేజీకి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న విద్యార్థులు(ఫైల్)

గన్నేరువరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలం నూతనంగా ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు దాటినా నేటికీ మండలంలో ప్రభుత్వజూనియర్ కళాశాల ఏర్పాటుచేయలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని విద్యార్థులు ఇంటర్ చదువులకు కరీంనగర్‌కు ప్రతిరోజు 40కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తోంది. మండలకేంద్రంలో జూనియర్ కాలేజీ లేకపోవడంతో గత్యంతరం లేక ప్రతిరోజు ఉదయం సాయంత్రం ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేట్ కాలేజీల బస్సుల్లో ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కాలేజీకి అనువైన స్థలం ఉండడంతో అందులో కాలేజీ ఏర్పాటుచేయాలని గతంలో నివేదికలు పంపినా సంబంధిత అధికారులు దానిపైన ఎలాంటి దృష్టిని పెట్టలేదు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు కరీంనగర్‌లోని ప్రైవేట్‌కాలేజీలకు పంపాల్సి వస్తుంది. తల్లిదండ్రులకు భారం పెరుగుతోంది. దూరాభారంతో పిల్లలకు చదువుపై ఏకాగ్రత లోపిస్తుందని లక్షలు ఖర్చుపెట్టి హాస్టల్‌లో ఉంచుతూ పిల్లల చదువు కోసం అప్పుల పాలవుతున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్ర తినిధులు స్పందించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిద్రండులు, విద్యార్థులు కోరుతు న్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

జగిత్యాలరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం తిప్పన్నపేటకు చెందిన చింతకుంట్ల రాజనర్సయ్య(58) అనే రైతు వాగులో చేపలు పడుతుండగా విద్యు దాఘాతంతో మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో రాజనర్సయ్య తిప్పన్నపేట శివారులో విద్యుత్ వైరు అమర్చి వాగులో చేపలు పడుతున్నాడు. ఈక్రమంలో విద్యుత్ తీగ తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు. శనివారం బంధువులు రాజనర్సయ్య ఆచూకీ కోసం వెతుకుతుండగా వాగులో మృతదేహం కన్పించింది. పోలీసులు మృతదేహాన్ని వాగులో నుంచి బయటికి తీసి జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒకకూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వ్యవసాయ కూలీ మృతి

సిరిసిల్ల రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంబస్వాపూర్‌కుచెందిన వ్యవసాయకూలీ బంటు ఆనందం (45) చెట్టుపైనుంచి పడి మృతిచెందాడు. శనివారం గ్రామంలోని చెట్టుపై చింతకాయలు తెంపేక్రమంలో ప్రమాదవ శాత్తుజారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆనందంను చికిత్సకోసం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించిచికిత్స చేస్తుండగా మృతిచెందాడు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో ఈనెల 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్న గంగయ్య(45) గాయాల పాలై హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్న గంగయ్య ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో బుర్రవేణి కొండయ్య వద్ద గొర్రెల కాపారిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గంగయ్యను అదే గ్రామానికి చెందిన బిస్కు సత్యం తన ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్న చిన్న గంగయ్య పరిస్థితి విషమించి చనిపోయాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌కు చెందిన బాధితుడి బావమరిది కర్రోళ్ల మల్లేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

ముస్తాబాద్ మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ మానేరువాగు ఇసుకరీచ్ నుంచి ముస్తాబాద్ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఇసుకను రవాణా చేయడం సరైనది కాదన్నారు. ముస్తాబాద్‌లో జరిగే అభివృద్ధి పనులకు ముస్తాబాద్‌కు చెందిన ట్రాక్టర్ యజమానులకు రవాణా బాధ్యతలు అప్పగించాలని కోరారు. వాగులో ఇసుక ట్రాక్టర్లు, యజమానులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు సంఘటన స్థలానికివెళ్లి వారిని శాంతింప చేశారు.

కుక్కను రక్షించబోయి బాలిక మృతి


శ్రీనిధి(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కను రక్షించబోయిన బాలిక చెరువులో పడి మృతిచెందిన ఘటన కొత్తపల్లి మండలం రేకుర్తిలో శనివారం జరిగింది. కొత్తపల్లి పోలీసుల వివరాలప్రకారం.. రేకుర్తికి చెందిన మైరాల శ్రీనిధి(11) శనివారం తన పెంపుడు కుక్కతోపాటు పెంటకమ్మ చెరువు వద్దకు వెళ్లింది. కొద్దిసేపు ఆడుకున్న తరువాత పెంపుడు కుక్క చెరువులోపడగా శ్రీనిధి గమనించి వెంటనే కుక్కను తాడుతో బయటకు లాగేక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయింది. గమనించిన ఇద్దరు యువకులు వెంటనే శ్రీనిధిని బయటకు తీసి ఆసుపత్రికి తర లించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు వెల్లడించారు. శ్రీనిధి సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి చైత్ర మాసం

● ఏప్రిల్ 9 నుంచి జూన్ 7 వరకు శుభ ముహూర్తాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సరంలో చైత్రమాసం, వసంత ఋతువు ఆదివారంతో ప్రారంభం కానుంది. వసంత ఋతువు, చైత్ర మాసం సంవత్సర ప్రారంభాలుగా, బ్రహ్మదేవుడు ఉగాది నాడే సృష్టి రచన ప్రారంభించాడని చెబుతారు. చైత్ర మాసంలో విశేష రోజులున్నా శ్రీరామ నవమి తర్వాతే శుభకార్యాలు ఆచరించవచ్చని శాస్త్రాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 9వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు వివాహాది శుభకార్యాలు నిర్వహించవచ్చు. మే 4 నుంచి 29వ తేదీ వరకు వాస్తు కర్తరితో గృహ ప్రవేశాలకు అవకాశం ఉండదు. జూన్‌లో గురు మూఢం కారణంగా జూన్ 10వ తేదీ నుంచి జూలై 9వ తేదీ వరకు ముహూర్తాలు లేవు. ఆగస్టు నెల శ్రావణమాసంలో ముహూర్తాలున్నాయి.

జాతీయస్థాయి ఉషూ పోటీల్లో ప్రతిభ



రైల్వేస్టేషన్‌లో నవీనను సత్కరిస్తున్న సీనియర్ క్రీడాకారులు

కోల్‌సిటీటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్‌లో జరిగిన ఖేలో ఇండియా అండ్ ఫెడరేషన్ కప్ జాతీయ స్థాయి ఉషూ పోటీల్లో ప్రతిభ కనపర్చిన ఓడ్డెపల్లి నవీనకు శనివారం రామగుండం రైల్వేస్టేషన్‌లో స్థానిక క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు. రామగుండం రైల్వే ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి తగరపు శంకర్, 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్, సీనియర్ కరాటే మాస్టర్ శ్రీనివాస్‌లు నవీనను సన్మానించారు. ఉషూ క్రీడలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జాతీయస్థాయిలో పతకాలు సాధించడం ఇదే మొదటిసారి అని కొనియాడారు. తెలంగాణ స్పోర్ట్స్ ఫెడరేషన్ కప్ సీనియర్ విభాగంలో రెండు విభాగాల్లో ప్రతిభ కనపర్చి ద్వితీయ, తృతీయస్థానాలను సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. రామగుండం మండల బీజేపీ అధ్యక్షుడు మిట్టపల్లి సతీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బల్వన్‌సింగ్, భావని, యూత్ అధ్యక్షుడు నల్లి నరేష్, కోచ్ సురేష్ పాల్గొన్నారు

చేతి వృత్తులకు వరం..

● ప్రధాని విశ్వకర్మ యోజనతో చేయూత
● పలు అంశాల్లో ఉచిత శిక్షణ





శిక్షణలో భాగంగా మహిళలు తయారు చేసిన గాజులు, బోకేలు, పూల దండలు

తిమ్మాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తుల వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనను ప్రవేశ పెట్టింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 17 సెప్టెంబరు 2023న ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తుంది. కేంద్ర ప్రభుత్వం 18 విభిన్న రంగాలకు చెందిన కళాకారులకు శిక్షణతో పాటు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో కార్పెంటర్, బోట్ మేకర్, ఆర్మర్, కమ్మరి, తాళాలు చేసేవారు, గోల్డ్ స్మిత్, కుండల తయారీదారులు, శిల్పి, తాపీ మేస్త్రీ, మత్యకార వలలు తయారు చేసేవాళ్లు, రాయి కొట్టేవారు, చెప్పులు కుట్టే వారు, బుట్ట, చాప, చీపుర్లు, గార్లండ్ మేకింగ్ (మలకార్), బొమ్మల తయారీ దారులు, టైలరింగ్, నాయి బ్రహ్మణులు వంటి సాంప్రదాయ వృత్తుల వారు ఉన్నారు. ఎంపికైన వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి లబ్ధిదారులకు వ్యాపారం చేసేందుకు అర్హులైన వారికి తక్కువ వడ్డీకి రుణం అందిస్తారు.

● **ప్రయోజనాలు**

ఈ పథకం కొసం ధరఖాస్తు చేసుకున్న తరువాత నైపుణ్య శిక్షణకు ఎంపిక చేస్తారు. ఎంపికైన ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో రోజుకు 500 రూపాయల స్టైఫండ్, శిక్షణ అనంతరం సర్టిఫికేట్, గుర్తింపు కార్డును ఇస్తారు. వ్యాపారానికి అవసరమయ్యే పరికరాల కిట్‌ను కాని, కిట్ కొనుగోలుకు అవసరమైనా ఆర్థిక సహాయం కాని అందజేస్తారు.

● **మహిళా ప్రాంగణంలో..**

తిమ్మాపూర్ మండలంఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో భాగంగా మహిళాలకు పలు చేతి వృత్తులకు సంబంధించి శిక్షణ ఇస్తున్నారు. దండలు అల్లడం, చీరల కొంగులు ముడివేయడం, బొకేస్ తయారు చేయడం, ఎన్వలప్, హోమ్ డెకరేటర్ వస్తువులు, ఇయర్ రింగులు, బ్యాంగిల్స్ డిజైన్, పేపర్ ఫ్లవర్స్ తయారీపై శిక్షణ నిస్తున్నారు. ఇప్పటికి నాలుగు బ్యాములకు శిక్షణ పూర్తయింది. ఒక్కో బ్యాచ్‌లో 10నుంచి17మంది మహిళాలకు శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణ బాగుంది..



- ఎన్‌లత, వేములవాడ

కార్యదర్శులు చేబితే అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ బాగుంది. పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

ఉపాధి అవకాశాలు ఉంటాయి



- రాజ వర్ధిణీ, ట్రైనర్

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో చేరి శిక్షణ పొందుతున్న మహిళాలకు ఉపాధి అవకాశాలు బాగుంటాయి. ఇంట్లో ఉండి కూడా జీవనోపాధి పొందొచ్చు. బ్యాంగిల్స్ డిజైన్, ఇయర్ రింగ్స్ పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నాం.

నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ



సుధారాణీ,
ప్రాంగణం జిల్లా మేనేజర్

ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చాం. ఒక్కో బ్యాచ్‌లో 10 నుంచి 17 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. నిరుపేదలకు ఈ పథకం వరం లాంటింది. ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్ ఇస్తున్నాం. శిక్షణ అనంతరం ఉపాధి పొందేందుకు సహకారం అందజేస్తాం.

● **అర్హతలు :**

ఈ పథకానికి 18 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు, అసంఘటిత రంగంలో పని చేసే కార్మికులు దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యాపారాల్లో నైపుణ్యం కలిగి, చేతి వృత్తులు సాగించే వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకొడానికి అర్హులు.

● **ఇలా దరఖాస్తుల చేసుకోవాలి**

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో చేరే వారు ముందుగా సంబందిత ప్రభుత్వ వెబ్ సైట్(pmvishwakarma.gov.in)లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేయడానికి ఆధా ర్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు గానీ, ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరి. ఆదాయ ధ్రువీకరణ పత్రం, చిరునామాను నిర్ధారించే పత్రం, పథకానికి సంబందించి ఆర్థిక లావాదేవీలు నిర్వహణకు బ్యాంకు ఖాతా వివరాలతో ధరఖాస్తు చేసుకొవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం పూర్తి అయిన తరువాత వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాత అర్హులైనా వారిని ఉచిత శిక్షణకు పిలుస్తారు.

ధర్మపురిలో పెరిగిన భక్తుల రద్దీ

ధర్మపురి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజ లు చేయించుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి పోయారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కు మార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణులు పూజలు నిర్వహించారు.

అంతర్రాష్ట్ర సైబర్ మోసగాడి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని ఆశ చూపి రూ.40.9 లక్షలు స్వాహ చేసిన అంతర్రాష్ట సైబర్ మోసగాడిని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో సైబర్ క్రైం డీఎస్పీ నరసింహారెడ్డి కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి 2024 జూలైలో ఇన్‌స్టాగ్రాంలో ఆన్‌లైన్‌లో పెట్టుబడికి సంబంధించిన ప్రకటన వచ్చింది. దానికి స్పందించిన బాధితుడు మొదట వెయ్యి రూపాయలు పెట్టుబడి పెట్టగా రెండు వేల రూపాయల లాభం వచ్చింది. దీంతో బాధితుడు ఏడు విడతలో రూ.40.9 లక్షలు సదరు సంస్థలో పెట్టుబడి పెట్టాడు. పెట్టుబడి కింద పెట్టిన డబ్బులకు లాభం వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపించేది. ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసుకునేందుకు అవకాశం ఉండకపోయేది. దీంతో మోసానికి గురైనట్లు తెలుసుకున్న బాధితుడు 2024 ఆగస్టులో సైబర్ క్రైం హెల్ప్‌లైన్ సెంటర్ 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ కేసుపై కరీంనగర్ సైబర్ క్రైం డీఎస్పీ నర్సింహారెడ్డి విచారణ ప్రారంభించారు. గుజరాత్‌కు సంబంధించిన బ్యాంక్ ఖాతాలో బాధితుడి డబ్బులు జమ అయినట్లు గుర్తించారు. ఈ మేరకు సైబర్ క్రైం పోలీసు టీం సభ్యులు ఈ నెల 27న గుజరాత్‌లోని సూరత్‌కు వెళ్లారు. అక్కడ సైబర్ మోసగాడైన నితిన్‌దేవచంద్ భాయ్ గజేరాని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సూరత్ కోర్టులో నిందితుడిని హాజరు పరిచారు. అక్కడి కోర్టు అనుమతితో ట్రాన్సిస్ట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొచ్చి శనివారం కరీంనగర్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో నిందితుడు నితిన్ దేవచంద్ భాయ్ గజేరానిని జైలులో రిమాండ్‌కు తరలించారు. నిందితుడు ఇన్‌వెస్ట్‌మెంట్‌కు సబంధించి సామాజికమాధ్యమాల ద్వారా ఆకర్షణీయ ప్రకటనలు పంపిస్తాడని, స్పందించిన వారికి రెట్టింపు లాభాలు ఆశచూపి ఆర్‌బీ ఎల్ బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ చేయమంటాడని సైబర్ క్రైం డీఎస్పీ తెలిపారు. ఆ అకౌంట్‌పై 19 వరకు కేసులు నమోదైనట్లు గుర్తించామన్నారు. తెలంగాణలోని రెండు జిల్లాలతోపాటు, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కేరళలో నితిన్‌దేవచంద్ భాయ్ గజేరానిపై కేసులు నమోదైనట్లు తెలిపారు.

ఉగాది కవి సమ్మేళనానికి మానేరు కవులు

సిరిసిల్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతియేటా నిర్వహించే కవి సమ్మేళనానికి సిరిసిల్ల నుంచి ధాశరధి అవార్డు గ్రహీత ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, మానేరు రచయితల సంఘం కవులు పత్తిపాక మోహన్, అడెపు లక్ష్మణ్, ఈడెపు సౌమ్యలకు తెలంగాణ సాంస్కృతిక శాఖ అహ్వానం పంపింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉగాది సందర్భంగా నిర్వహించే కవి సమ్మేళనంలో వీరు కవితాగానం చేయనున్నారు.

కవి సమ్మేళనానికి వెళ్తున్న కవులను మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టివి నారాయణ, కార్యనిర్వా హక అధ్యక్షుడు ఎలగొండ రవి, మడూరి అనిత, శ్రీమతి, అంకారపు, దూడం గణేష్ తదితరులు అభినందించారు.

అనుమానం పెనుభూతమై..

● భార్యపై రోకలిబండతో దాడి.. ఆపై ఆత్మహత్య



దుర్గయ్య(ఫైల్)



రాజవ్వ(ఫైల్)

మల్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను రోకలిబండతో తలపై కొట్టడంతో తీవ్రగాయాలు కాగా భయాందోళనకు గురైన భర్త సదువుల దుర్గయ్య(58) ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంబాడిపల్లిలో జరిగింది. తీవ్రగాయాలతో భార్య రాజవ్వ(48) శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. లంబాడిపల్లికి చెందిన సదువుల దుర్గయ్య బేడ బుడిగ జంగాల కులవృత్తిలో భాగంగా వివిధ ప్రాంతాలకు వెళ్లి భిక్షాటన చేస్తూ మూడు నెలలకోసారి స్వగ్రామానికి వస్తుంటాడు. కొన్నాళ్లుగా భార్యపై అనుమానంతో మద్యానికి బానిసైన దుర్గయ్య రాజవ్వను వేధిస్తున్నాడు. దీంతో కుల పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీ నిర్వహించి దుర్గయ్యను మందలించారు. అయినప్పటికీ పద్ధతి మార్చుకోక పోగా శుక్రవారం బీడీలు చేస్తున్న రాజవ్వను రోకలిబండతో తలపై దాడి చేశాడు. దీంతో తలకు తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు రాజవ్వను వెంటనే చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. కాగా భార్య తలకు తీవ్ర గాయాలు కావడంతో భయపడిన దుర్గయ్య గ్రామంలోని బీరయ్యగుడి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

దుర్గయ్య కోసం బంధువులు శుక్రవారం రాత్రి వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం దుర్గయ్య గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. కాగా చికిత్స పొందుతూ రాజవ్వ శనివారం కరీంనగర్‌లోని ఆసుపత్రిలో మృతి చెందింది. మృతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తండ్రి సిరిగిరి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నీలం రవి తెలిపారు.

నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

● వేములవాడ ఆలయంలో ఏర్పాట్లు



రాజన్న ఆలయంలో కల్యాణానికి ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్, 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. రాజన్న ఆలయంలో ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీరామనవమికి ఎనిమిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8.30 గంటల తర్వాత భక్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించుకునే వెసులుబాటు కల్పించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయ మే స్వస్తి పుణ్యాహవచనం, స్వామివారితో పాటుగా అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజ లు నిర్వహిస్తారు. ఉదయం 10.40 గంటలకు పంచాంగ పూజ, సాయంత్రం 4 గంటలకు పంచాంగ శ్రవణం, పండిత సన్మానం నిర్వహించనున్నారు.

● 6న సీతారాముల కల్యాణం

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో ఏప్రిల్ 6వ తేదీన సీతారాముల దివ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేం దుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని తీరొక్క పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఏప్రిల్ 6న ఉదయం 11.55 గంటలకు సీతారామచంద్ర స్వామి కల్యాణం, సాయంత్రం రథోత్సవం రాత్రి డోలోత్సవం నిర్వహించనున్నారు. కల్యాణం రోజు కోడె మొక్కులు మినహా అభిషేకాలు, అన్నపూజలు, నిత్యకల్యాణాలు, కుంకుమ పూజలు, లింగార్చనలు, శ్రీసత్య నారాయణ వ్రతాలతో పాటు ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నారు.

భారీగా తరలిరానున్న భక్తులు

రాజన్న ఆలయంలో నిర్వహించే సీతారామచంద్ర స్వామి వారి దివ్య కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. సుమారు 50 వేలకు పైగా భక్తులు రానున్నట్లు ఆల యాధికారులు అంచనా వేస్తున్నారు. భక్త లకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖల అధికారులతో ఆర్డీవో, ఆలయ ఈవో సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుం డా టౌన్ సీఐ వీరప్రసాద్ నేతృత్వంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

రాములోరి కల్యాణ వాల్‌పోస్టర్‌ను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భం గా రాజన్న ఆలయ ఆవరణతో పాటుగా పట్ట ణంలో ఏఈవో అశోక్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ లను అతికించారు.

పథకం ప్రకారమే యువకుడి హత్య

● ప్రోత్సహించిన భార్య, బావమరిది
● పరువుహత్య కేసులో ముగ్గురు నిందితుల రిమాండ్

ఎలిగేడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కూతురిని ప్రేమించాడనే కారణంతో పరువు హత్యకు పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి కథనం ప్రకారం ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థురాలు అయిన ఒక అమ్మాయిని సాయికుమార్‌గౌడ్ రెండు సంవత్సరాలుగా ప్రేమిస్తున్నాడు. ఇద్దరు ఒకరినొకరు ప్రేమించుకుని పెళ్లి చేసుకుందామని అనుకున్నారు. ఈ విషయం తెలిసిన అమ్మాయి తండ్రి ముత్యం సదయ్య పలుమార్లు సాయికుమార్‌ని, కూతురిని మందలించినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో అతడిని చంపితేనే తన కూతురిలో మార్పు వస్తుందని అమ్మాయి తల్లి సమత సదయ్యతో చెప్పింది. అలాగే రంగాపూర్‌కు చెందిన సమత సోదరుడు కూడా అతన్ని చంపితేనే బాగుంటుందని, ఏమైనా సహాయం అవసరం ఉంటే తర్వాత చేస్తానని చెప్పాడు. ఈ క్రమంలో ఈనెల 27వ తేదీన పూరెల్ల సాయికుమార్‌గౌడ్ జన్మదినం ఉన్నందున కూతురు చదువుతున్న పెద్దపల్లిలోని కాలేజీ వద్దకు వస్తాడని గ్రహించిన సదయ్య, అతని బావమరిది సారయ్యతో కలిసి కాలేజీ వద్ద వాకబు చేశారు. అక్కడ ఆమె లేదని తెలుసుకొని వేచిచూశారు. కూతురిని సాయికుమార్ ద్విచక్ర వాహనంపై కాలేజీ వద్ద దింపి ముప్పిరితోటకు వెళ్లాడు. అనంతరం రాత్రి 9.40గంటలకు సాయికుమార్ మిత్రులతో కలిసి వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో మద్యం సేవిస్తుండగా సదయ్య వాహనంపై వెళ్లి సాయికుమార్‌పై గొడ్డలితో విచక్షణ రహితంగా నరికి చంపాడు. అక్కడికి నడుచుకుంటూ వెళ్లిన సదయ్య భార్య సమత సంఘటనను చూసి వెళ్లిపోయింది. సంఘటన జరిగిన వెంటనే నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. శనివారం ఉదయం 11గంటలకు నిందితులు సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద హైదరాబాద్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రాత్రి 10గంటలకు సుల్తానాబాద్ న్యాయాధికారి ఎదుట హాజరు పరిచారు.

సైబర్ నేరాలపై అవగాహన

సిరిసిల్ల క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. శనివారం విద్యానగర్‌లో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఏదైనా అవసరం ఉంటే వెంటనే డయల్ 100కు ఫోన్‌చేస్తే పోలీసులు వచ్చి చేయూతనందిస్తారన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో శనివారం తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం వాల్ పోస్టర్‌ను తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10గంటలకు తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం ఉంటుందని జేఏసీ నాయకుడు మార్వాడి సుదర్శన్ తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, తెలంగాణ ఉద్యమకారులు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

సిరిసిల్ల టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో శనివారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు హలో బీసీ.. చలో ఢిల్లీ వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణను చేపట్టి శాసన సభలో 29 శాతం నుండి 42 శాతంకు బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ బిల్లును ఆమోదించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే బీసీల పోరు గర్జన ధర్నను విజయవంతం చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా, పట్టణ, వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు ఉగాది సంబరాలు



సిరిసిల్ల పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో విద్యార్థినుల నృత్యాలు


ఎల్లారెడ్డిపేటలో పంచాంగ శ్రవణం..


బోయినపల్లి మండలం విలాసాగర్‌లో..

సిరిసిల్ల రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వం పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలను జరుపుకున్నారు. పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ రాజుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ ఎంపీహెచ్ఎస్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమ, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, రాజమల్లు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండల కేంద్రాలతో పాటు గుండారం, నారాయణపూర్, బొప్పాపూర్, గొల్లపల్లి, బండలింగంపల్లి, తిమ్మాపూర్, బాకురుపల్లి, వెంకటాపూర్, కోరుట్లపేట, రాజన్నపేట, దమ్మన్నపేట, నాగంపేట, కొత్తపల్లి, నర్మాల, మల్లారెడ్డిపేట, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తుగా ఉగాది వేడుకలు జరిగాయి. కందికట్కూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గాలిపెల్లి గ్రామంలోని శ్రీసాయి, ఇల్లంతకుంటలోని వాణీనికేతన్ హైస్కూల్‌లో ఉగాది, ముందస్తు రంజాన్ వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, తూముకుంట శ్రీనిధి, సుదగోని రమేష్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కందికట్కూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉగాది వేడుకలు

●చందుర్తి : మండలంలోని ననుగుల, నర్సింగాపూర్ గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో ఉగాది పండగ ముందస్తు వేడుకలను శనివారం ఘనంగా నిర్వ హించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు జలంధర్‌రెడ్డి, ముఖేష్, ఉపాధ్యాయులు మేకల పద్మ, కోరెపు శ్రీనివాస్, న్యాతరి నాగమణి, యాస నవ్య, ఎగోళం మాధవి, అనిత, శ్రీధర్, రమేష్, లాస్య, ప్రణవి పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలతో పాటు పాలు పాఠశాలల్లో ఉగాది వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మురళి నాయక్, ప్రిన్సిపాల్ శివకుమార్ రెడ్డి, కనగర్తి హెచ్ఎం పరిచయ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● బోయినపల్లి : మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందస్తుగా ఉగాది వేడుకలను నిర్వహించారు. హెచ్ఎం బొలగం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు పండగలపై అవగాహన కలించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏటా నిర్వహిస్తున్నామని, విద్యార్థులు చురుకుగా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు.

● వీర్నపల్లి : వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ముందస్తుగా ఉగాది పండుగ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పండుగల విశిష్టతను ప్రతి ఒక్కరు చిన్నతనం నుంచి తెలుసుకోవాలనే ఉద్దేశంతో అంగన్వాడీ కేంద్రంలో అన్ని రకాల పండుగలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయులు కముటం శేఖర్, లావణ్య, అంగన్వాడి టీచర్ నలిమేటి సుశీల, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, పాఠశాల డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకర బావుల చుట్టూ కంచె ఏర్పాటు

ఇల్లంతకుంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డుప్రక్కన ప్రమాదకరంగా ఉన్న బావుల చుట్టూ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కంచెను ఏర్పాటు చేశారు. మండలంలోని దాచారం, పెద్దలింగాపూర్ తదితర గ్రామాల్లో రోడ్డుపక్కనే బావులు ఉన్నాయి. ఇటీవలే పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శీలం రజనీకాంత్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై వస్తూ బావిలో పడి మృతిచెందాడు. ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు రక్షణ చర్యలు చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం, నర్సక్కపేట గ్రామాలలో సీసీ రోడ్డు పనులను శనివారం బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా ప్రారంభించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాల కోసం కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణలు నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, మాజీ సర్పంచ్ ఏలేటి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు శనివారం అందజేశారు. గ్రామంలోని రామస్వామికి రూ.21 వేలు, స్రవంతికి రూ.13.5వేలు, షాకెత్‌కు రూ.12 వేలు, ఎల్లవ్వకు రూ.5.5 వేలు, మౌనికకు రూ.28 వేలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు శివరాంరెడ్డి, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవరెడ్డి, భీమేశ్వర్, సత్యం, రజినీకాంత్, కిషన్, అశ్వాక్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

ఇల్లంతకుంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని మసీదులో మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ ముస్లీంలకు ఇఫ్తారు విందు ఇచ్చారు. ఎలవేని రమేష్, కేతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రేగుల బిక్షపతి, ల్యాగల బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు నిమ్మపెల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ బాషా, గ్రామానికి చెందిన ఎలగందుల లవన్ ఆధ్వర్యంలో ముస్లింలకు శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయలు ఎల్లయ్య, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్ రమేష్‌రెడ్డి, నరసింహాచారి, మానక సత్యం, నాగండ్ల భూమేష్, వాల్యా నాయక్, రాజశేఖర్, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

● బోయినపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తడగొండలో ముస్లింలకు బీఆర్ఎస్ నాయకుడు జోగినపల్లి శ్రీనివాసరావు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కొనుకోటి లచ్చిరెడ్డి, గుంటి శంకర్, చిందం రమేష్ నాగుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలం కోరుట్లపేట, నాగంపేట, నర్మాల గ్రామాల్లో పలువురు కుటుంబాలను రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి శనివారం పరామర్శించారు. కోరుట్లపేటలోని రెడ్డి సంఘం అధ్యక్షుడు పోచిరెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆయన ఆరోగ్య పరిస్థితిని కృష్ణారెడ్డి అడిగి తెలుసుకున్నారు. సమయానికి మందులు వాడుకోవాలని సూచించారు. నాగంపేట మాజీ సర్పంచ్ సుజాత, నర్మాలలో పురం సత్యంరావులు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. నాయకులు రాంరెడ్డి, హసన్, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌లో నెల్లుట్ల అంజయ్య(65) శనివారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన అంజయ్య ఇంట్లోనే అతిగా మద్యం సేవించి కిందపడి మృతిచెందాడు. అతడి పెద్దకూతురు అర్చన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్ సమీపంలోగల మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న శాంతినగర్‌కు చెందిన బూర్ల లక్ష్మీనారాయణను శనివారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. లక్ష్మీనారాయణ ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో వెళ్లి పట్టుకున్నామని తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్‌చేశామని తెలిపారు.

దళితుడిపై దాడి చేసి దుండగులను శిక్షించాలి

గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని దళితుడు బత్తుల చంద్రంపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం శనివారం డిమాండ్ చేశారు. చంద్రం తన స్వంత స్థలంలో హనుమాన్ ఆలయం నిర్మించి యేటా ఉత్సవాలను నిర్వహిస్తున్నాడన్నారు. కొందరు కక్షపూరితంగా దాడికి దిగారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేరని ఆరోపించారు. ఇప్పటికైనా దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు.

గత మున్సిపల్ పాలకవర్గంలో అవకతవకలు

సిరిసిల్ల టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గత మున్సిపల్ పాలకవర్గం అవకతవకలకు పాల్పడిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాజీ కౌన్సిలర్లు కత్తెర దేవదాస్, కుడికాల రవికుమార్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్ గౌడ్, నాయకులు వెల్ముల తిరుపతిరెడ్డి, కాముని నళినీకాంత్, చెన్నమనేని కమలాకర్‌రావు, కల్లూరి చందన శనివారం విలేకరులతో మాట్లాడారు. టెండర్లు వేయకుండా సొంతగా పనులను చేసుకుంటూ బిల్లులను తీసుకున్నారని, గతంలో చేసిన పనులకు మళ్లీ చేసినట్లు బిల్లులను తీసుకున్నారని ట్రాక్టర్ల కొనుగోలులో కూడా అనేక అభియోగాలున్నాయని అన్నారు. అవినీతి అక్రమాలపై కలెక్టర్ విజిలెన్స్ అధికారుల ద్వారా దర్యాప్తు జరపాలని కోరారు.

తాగునీరు పోసి.. ఆహారం అందించి


కోతులకు ఆహారం అందిస్తున్న బాల్‌రెడ్డి

గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం గోరంటాలకు చెందిన వన సంరక్షణ మాజీ అధ్యక్షుడు కొలుముల బాల్‌రెడ్డి మండలంలోని పెద్దమ్మ అటవీ ప్రాంతంలో తాగు నీరు లేక కోతులు అల్లాడుతున్నాయని గమనించి శనివారం ట్యాంకరు ద్వారా తొట్టిలను నీటితో నింపారు. అనంతరం వానరాలకు ఆహారం అందించారు. ఇలాగే రెండు రోజులకొకసారి నీటిని అందిస్తానని బాల్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం


సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం టీడీపీ కార్యాలయంలో శనివారం పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గం ఇంచార్జి దయాకర్‌రావు మాట్లాడారు. టీడీపీని స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పేదలకు కూడు, గుడ్డ, గూడును అందించారని అన్నారు. ఎన్టీఆర్ అనంతరం నారా చంద్రబాబునాయుడు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చి టీడీపీ ఆశయాలకు కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో కూడా టీడీపీని అధికారంలోకి తీసుకురావడం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా పట్టణ నాయకులు తీగల శేఖర్‌గౌడ్, గుజ్జె శివరాం, నక్క రాజయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, బింగి వెంకటేశం, మ్యాన వెంకటేశం, గుజ్జె అశోక్, బండారి నారాయణ, బేతి రవీందర్, జెట్టి కొమరయ్య, వేముల సత్యనారయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో టీడీపీ ఆవిర్భావ వేడుకలను పార్టీ శ్రేణలు ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మచ్చ ఆంజనేయులు, మండల శాఖ అధ్యక్షుడు కడారి రాంరెడ్డి, నాయకులు గ్యాద సత్తయ్య, పయ్యావుల లక్ష్మణ్, ప్రభాకర్‌రెడ్డి, గుంటి అంజయ్య, లెంకల శ్రీకాంత్‌రెడ్డి, దత్తు తదితరులు ఉన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో టీడీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో శనివారం టీడీపీ సీనియర్ నాయకులు నెంబర్ వెంకటి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. బస్టాండ్‌లో టీడీపీ గద్దె వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో హన్మాండ్లు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


కొనాయపల్లిలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

● వేములవాడ టౌన్ : వేములవాడ మున్సిపల్ పరిధిలో ని కొనాయపల్లి గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొనాయపల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్తలు చేరుకుని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతరం తెలుగుదేశం జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రామస్వామి, భాస్కర్, రాజు, దేవయ్య, సుధాకర్‌రావు, వెంకటేశం, మల్లేశం, కృష్ణ, లచ్చిరెడ్డి, గంగయ్య, దేవయ్య, రాజు తదితరులు ఉన్నారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం

ఎల్లారెడ్డిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆర్య వైశ్య సంఘంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉగాది ఉత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కార్యవాహ బాలరాజు, శ్రీనివాస్‌లు హాజరయ్యారు. బాలరాజు మాట్లాడుతూ యుగానికి ఉగాది మూలమని అన్నారు. ప్రతి హిందువు ఆంగ్ల సంవత్సరం కాకుండా ఉగాది పండుగను వైభవంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖండ కార్యవాహ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

సిరిసిల్ల రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ మండల ప్రాథమిక పాఠశాలకు వాటర్ ఫిల్టర్‌ను శనివారం యూనీమోనీ ఫైనాన్స్ సర్వీసెస్ లిమిటెడ్ సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో అందించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన నీరును అందించాలనే సంకల్పంతో దీనిని అందించినట్లు యూనీమోనీ సీఈవో కృష్ణన్, జోనల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ దూస రాజేంద్రప్రసాద్, బ్రాంచ్ మేనేజర్లు బచ్చుప్రభాకర్, ఇటుకల నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్, ఉపాధ్యాయులు వాసాల హరిప్రసాద్, చందన, కరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో యునిమనీ ఆధ్వర్యంలో ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను మేనేజర్ బొల్లం నాగరాజు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి యాక్టివిటీ యునిమని ఫైనాన్స్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ సీఈవో కృష్ణన్ ఆంధ్ర, తెలంగాణ జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి గ్రామస్థులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు యునిమని సంస్థ నీటి శుద్ధి పరికరాన్ని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ జోనల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, రీజినల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, ఎల్లారెడ్డిపేట శాఖ మేనేజర్ శంకర్, ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్‌రావు, భాస్కర్, ఆనంద్, నారాయణ, ఆశ్లేష, నాగరాణి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎల్లారెడ్డిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం గోర్‌బోలి(లంబాడా) భాషను భారత రాజ్యాంగంలోని 8 వ షెడ్యూల్‌లో చేర్చాలని శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలోని గిరిజనులు, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు వీర్నపల్లి ఏఎంసీ చైర్మన్ రాములు, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాజునాయక్, కిషన్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్, గోపాల్, నవీన్‌నాయక్, అనిల్‌నాయక్, చందర్‌నాయక్, అమర్‌సింగ్, ప్రశాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : వీర్నపల్లి మండలం బాబాయి చెరువుతండా గ్రామంలో గోర్ బోలీ భాషను 8 షెడ్యూల్లో చేర్చి అసెంబ్లీలో ఆమోదం తెలిపినందుకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సంతోష్ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, మంత్రులు, సీఎం చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ భూక్యా మదన్‌లాల్, మాజీ సర్పంచ్ లక్ష్మి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సంతోష్ నాయక్, మండల నాయకులు భూక్యా సంతోష్ నాయక్, భూక్యా గాజన్‌లాల్ నాయక్, పెద్ద రాజు నాయక్, అజ్మీర గోవింద్ నాయక్, ప్రకాష్ నాయక్, ఎఫ్ఏ రాజు, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోగులతో మర్యాదగా ఉండాలి

- జిల్లా వైద్యాధికారి రజిత

కోనరావుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రోగులతో మర్యాదగా ఉండి నాణ్యమైన చికిత్స అందించాలని జిల్లా వైద్యాధికారి రజిత అన్నారు. కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి శుక్రవారం రాత్రి తెలు కుట్టిన పని గంగారాంను కలెక్టర్ సందీప్ కుమార్ ఆదేశాల మేరకు సందర్శించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. కోనరావుపేట ఆరోగ్యకేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వేణుమాధవ్, డాక్టర్ సురేష్ కుమార్, సిహెచ్ఓ కృష్ణమూర్తి, బాలచంద్రన్ తదితరులు ఉన్నారు.

ఆశాలపై అదనపు పనిభారం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ

సిరిసిల్ల రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లపై అదనపు పనిభారం మోపడం వల్లే ఇబ్బందులకు గురవుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలంలో రోడ్డు ప్రమాదానికి గురైన ఆశావర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఖాళీగా ఉన్న ఆశావర్కర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లంతకుంట మండల పరిధిలోని రహీంఖాన్‌పేట సబ్‌సెంటర్‌లో పనిచేస్తున్న ఆశావర్కర్లు పద్మ, తార, ఎల్లవ్వలను వెల్జీపూర్ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా అశావర్కర్ లేకపోవడంతో అధికారుల ఒత్తిడితో అక్కడ కూడా విధులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగానే శనివారం ప్రమాదంలో ముగ్గురు అశావర్కర్లకు గాయాలయ్యాయని తెలిపారు. ఈ ప్రమాదంలో పద్మ అనే అశావర్కర్ భుజానికి బలమైన దెబ్బ తాకిందని గాయపడ్డ అశావర్కర్లను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తీసుకవచ్చిన క్రమంలో అక్కడి వైద్యులు పట్టించుకోలేదన్నారు. ప్రైవేటు అసుపత్రిలో చికిత్స పొందుతున్న అశా వర్కర్లను సీఐటీయూ జిల్లా నాయకులు పరామర్శించి ప్రమాదానికి జరిగిన కారణాలు తెలుసుకున్నట్లు తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, జిందం కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించొద్దు..

వీర్నపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు పౌర హక్కులకు భంగం కలిగించద్దని తహసిల్దార్ ముక్తార్ పాషా అన్నారు. వీర్నపల్లి మండలం బావ్‌సింగ్ నాయక్ తండా గ్రామంలో అధికారులు శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో పూర్తిగా అంటరానితనాన్ని నిర్మూలించాలన్నారు. హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అధికారులు, ప్రజలు పౌర హక్కులపై ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జయ, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, హెడ్ కానిస్టేబుల్ బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివ, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : గ్రామంలో ప్రజల మధ్య ఎలాంటి వివక్ష లేకుండా కలిసి మెలిసి జీవించాలని ఆర్ఐ సంతోష్, జిల్లా విజిలెన్స్ ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యుడు తిరుపతినాయక్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మానవ హక్కుల పరిరక్షణ సమావేశం నిర్వహించారు. తిరుపతినాయక్ మాట్లాడుతూ అంటరానితనం లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో గ్రామ ప్రత్యేక అధికారి భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, పోలీస్ కానిస్టేబుల్ ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, స్థానికులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు, అధికారులు

● కోనరావుపేట : మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం తహసీల్దార్ బి. వరలక్ష్మి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్ రెడ్డి, ఆర్ఐ రాజశేఖర్, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని రేపాకలో శనివారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. గ్రామపంచాయితీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాజ్యాంగం ప్రజలందరికి సమాన హక్కులు కల్పించిందన్నారు. ఎవరైన వివక్షతకు గురయితే చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధికారులు రమేష్, బుట్టి రాజేందర్, సరస్వతిలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని రూరల్ ఎస్సై మారుతి అన్నారు. జయవరంలో శనివారం నిర్వహించిన సివిల్ రైట్స్‌డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివక్షత లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రమేష్, ఆర్ఐ బాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.